కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు రూ.3,662.17 కోట్ల విలువైన డివిడెండ్ చెక్కును అందజేస్తున్న ఎల్ఐసీ ఎండీ, సీఈవో సిద్ధార్థ మొహంతి

రికార్డు స్థాయికి సూచీలు

82,134కి సెన్సెక్స్, 25,151 పాయింట్లకు నిఫ్టీ

ముంబై, ఆగస్టు 29: దేశీయ స్టాక్ మార్కెట్లు కదంతొక్కాయి. బ్లూచిప్ సంస్థల ర్యాలీతో సూచీలు మరో శిఖరానికి చేరుకున్నాయి. గత పదిరోజులుగా పెరుగుతూ వచ్చిన సూచీలు గురువారం మరో రికార్డు స్థాయిలో ముగిశాయి. అన్ని రంగాల షేర్లలో క్రయ విక్రయాలు జోరుగా సాగడం, అంతర్జాతీయ పెట్టుబడిదారులు భారీగా నిధులు కుమ్మరించడంతో ఇంట్రాడేలో ఆల్‌టైం హైకి చేరుకున్న సూచీలు చివర్లో ఇదే ట్రెండ్‌ను కొనసాగించాయి. ఇంట్రాడేలో 500 పాయింట్ల స్థాయిలో పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 349.05 పాయింట్లు అందుకొని 82,134.61 వద్ద ముగిసింది. సూచీలకు ఇదే గరిష్ఠ స్థాయి ముగింపు కావడం విశేషం. గత ఎనిమిది సెషన్లలో సెన్సెక్స్ 1,709.93 పాయింట్లు లేదా 2.12 శాతం లాభపడింది. మరో సూచీ నిఫ్టీ 25 వేల పాయింట్ల పైన ముగిసింది. ఒక దశలో 140 పాయింట్లు లాభపడిన నిఫ్టీ చివరకు 99.60 పాయింట్లు అందుకొని 25,151.96 వద్ద స్థిరపడింది. గత 11 సెషన్లలో నిఫ్టీ 1,012.95 పాయింట్లు లేదా 4.19 శాతం లాభపడింది. మార్కెట్లో టాటా మోటర్స్ అత్యధికంగా నాలుగు శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, ఐటీసీ, రిలయన్స్ ఇండస్ట్రీస్, టెక్ మహీంద్రా, మారుతి, ఎస్బీఐలు లాభాల్లో ముగిశాయి. బోనస్ షేరును ప్రకటించడంతో రిలయన్స్ షేరు ఏకంగా 1.50 శాతం లాభపడింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.30,389.92 కోట్లు పెరిగి రూ.20,57,382.97 కోట్లకు చేరుకున్నది. కానీ, మహీంద్రా అండ్ మహీంద్రా, సన్ ఫార్మా, జేఎస్ డబ్ల్యూ స్టీల్, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఇన్ఫోసిస్, టాటా స్టీల్‌లు నష్టపోయాయి.

100జీబీదాకా ఉచిత స్టోరేజీ

రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ

- వినియోగదారులకు జియో ఏఐ, క్లౌడ్ వెల్‌కమ్ ఆఫర్
- దీపావళి నుంచి అందుబాటులోకి..
- చౌక ధరలకు డాటా-పవర్డ్ ఏఐ సర్వీసులు

ముంబై, ఆగస్టు 29: జియో వినియోగదారులకు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) అధినేత ముకేశ్ అంబానీ బంపర్ ఆఫర్ ఇచ్చారు. ఏఐ క్లౌడ్ వెల్‌కమ్ ఆఫర్‌ను ప్రకటించారు. ఇందులోభాగంగా జియో యూజర్లు 100జీబీదాకా ఉచిత క్లౌడ్ స్టోరేజీని పొందే అవకాశాన్ని కల్పించారు. దీంతో జియో కస్టమర్లు తమ ఫోటోలను, వీడియోలను, డాక్యుమెంట్లను, డిజిటల్ కంటెంట్, ఇతర డాటాను స్వేచ్ఛగా, మరింత భద్రంగా దాచుకునే సౌలభ్యం లభించింది. రాబోయే దీపావళి నుంచి ఈ ఆఫర్ అందుబాటులోకి రానున్నది. దీంతో ఇక చాలా చౌక ధరలకే మార్కెట్‌లో క్లౌడ్ డాటా స్టోరేజీ, డాటా-పవర్డ్ ఏఐ సర్వీసులు అన్నిచోట్ల, అందరికీ దొరుకుతాయని అంబానీ అన్నారు. గురువారం ఇక్కడ జరిగిన కంపెనీ 47వ వార్షిక భాగస్వాముల సమావేశం (ఏజీఎం)లో ఈ మేరకు అన్ని వివరాలందించారు.

మా సంపదనేం దాచట్లేదు

ఒక్కో మెట్టూ ఎక్కుతూ ఈ స్థాయికి వచ్చామని, దీని వెనుక ఎంతో కష్టం దాగి ఉన్నదని ముకేశ్ అంబానీ తమ సంస్థ ఎదుగుదలను వివరించారు. ఏజీఎంలో ఒకింత ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు. రిలయన్స్ కింది స్థాయి నుంచి పైకొచ్చిందన్న ఆయన.. తమకు భారీ మూలాలేమీ లేవని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలోనే మా సంపదను దాచుకోవట్లేదని, మరింత సంపదను సృష్టిస్తూ జాతి గర్వించదగ్గ కంపెనీగా రిలయన్స్‌ను తీర్చిదిద్దినట్టు పేర్కొన్నారు. బహుళ వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో విస్తరించిన రిలయన్స్.. భారతీయ అత్యంత విలువైన కంపెనీగా నిలిచిన విషయం తెలిసిందే. ఆయిల్ రిఫైనింగ్, ఆయిల్-గ్యాస్ ఉత్పత్తి, పెట్రో కెమికల్స్, టెలికం, రిటైల్, మీడియా ఇలా దాదాపు అన్ని కీలక రంగాల్లో రిలయన్స్ కంపెనీలున్న సంగతీ విదితమే. కాగా, లాభాల కోసమో లేక సంపదను దాచుకోవడానికో తాము వ్యాపార కార్యకలాపాలను చేయడం లేదని ముకేశ్ అంబానీ అన్నారు. జాతి సంపద సృష్టికే పనిచేస్తున్నట్టు తెలిపారు. తర్వాతి తరాలకు రిలయన్స్‌ను గొప్ప సంపదగా అప్పజెప్తామన్నారు. ఉత్పత్తి, సేవల్లో అత్యంత నాణ్యతను పాటిస్తున్నామని, దేశ వినియోగదారుల జీవన ప్రమాణాలను పెంచుతున్నామని వెల్లడించారు.

భారత్‌కు ఎనర్జీ సెక్యూరిటీ..

భారత్‌కు ఎనర్జీ సెక్యూరిటీని కల్పించే బాధ్యతను రిలయన్స్ తీసుకున్నదని ముకేశ్ అంబానీ అన్నారు. ఈ క్రమంలోనే పునరుత్పాదక శక్తిపై దృష్టి సారించామని, సోలార్ పవర్ విస్తరణ దిశగా అడుగులు వేస్తున్నామని వివరించారు. '2018 జూలైలో 100 బిలియన్ డాలర్ల విలువను రిలయన్స్ చేరుకున్నది. 2022లో 250 బిలియన్ డాలర్లకు చేరింది. 2027 నాటికి ఇది రెట్టింపవుతుందని నేను వాగ్ధానం చేస్తున్నాను. భవిష్యత్తులో లాభాలపరంగా, వృద్ధిపరంగా రిలయన్స్ కొత్త శిఖరాలను అధిరోహించగలదు' అని ముకేశ్ చెప్పారు.

ప్రపంచంలో జియోనే టాప్

ప్రపంచంలో ఇప్పుడు అతిపెద్ద మొబైల్ డాటా కంపెనీగా జియోనే ఉందని ముకేశ్ తెలియజేశారు. గడిచిన 8 ఏండ్లలో సంస్థ కస్టమర్లు 49 కోట్లకు పెరిగారని, సగటున నెలకు 30జీబీకిపైగా డాటా వాడుతున్నారని చెప్పారు. ఇక ప్రపంచంలో అతిపెద్ద డాటా మార్కెట్‌గా భారతే ఉందన్న ఆయన.. ఇందుకు జియోనే కారణమన్నారు. అంతర్జాతీయ మొబైల్ ట్రాఫిక్‌లో జియో వాటా 8 శాతంగా ఉన్నట్టు వివరించారు. అలాగే 5జీ, 6జీ టెక్నాలజీల్లో జియోకు 350 పేటెంట్లున్నట్టు ఈ సందర్భంగా ముకేశ్ అంబానీ ప్రకటించారు. ఈ క్రమంలోనే ప్రతి నెలా 10 లక్షల బ్రాడ్‌బాండ్ కనెక్షన్లను లక్ష్యంగా చేసుకోబోతున్నట్టు తెలిపారు. అంతేగాక 2 కోట్లకుపైగా చిన్న-మధ్యతరహా వ్యాపారాలను, 15 లక్షల పాఠశాలలు-కళాశాలలను, 70వేలకుపైగా దవాఖానలను, 12 లక్షల డాక్టర్లను బ్రాడ్‌బాండ్‌తో కనెక్ట్ చేసే దిశగా వెళ్తున్నట్టు వెల్లడించారు.

1:1 బోనస్ షేర్ల పరిశీలన

తమ ఈక్విటీ షేర్‌హోల్డర్లకు 1:1 శ్రేణిలో బోనస్ షేర్లను ఇవ్వాలని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ భావిస్తున్నది. ఈ అంశాన్ని సంస్థ బోర్డు సెప్టెంబర్ 5న పరిశీలించనున్నది. ఈ మేరకు స్టాక్ ఎక్స్ఛేంజీలకు కంపెనీ తెలియజేసింది. కాగా, 2017 సెప్టెంబర్‌లో చివరిసారిగా బోనస్ షేర్లను జారీ చేసింది రిలయన్స్. మళ్లీ ఏడేండ్ల తర్వాత బోనస్ షేర్లను సిఫార్సు చేసే దిశగా కంపెనీ వెళ్తుండటం గమనార్హం. 2009లోనూ 1:1 ప్రాతిపదికన వాటాదారులకు బోనస్ షేర్లను రిలయన్స్ ఇండస్ట్రీస్ అందించిన సంగతి విదితమే.

లగ్జరీ నగల వ్యాపారంలోకి..

వచ్చే 3-4 ఏండ్లలో రిటైల్ వ్యాపారాన్ని రెట్టింపు చేసే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్టు రిలయన్స్ ప్రకటించింది. ఇందులో భాగంగానే లగ్జరీ జ్యుయెల్లరీ సెగ్మెంట్‌లోకి అడుగు పెట్టాలని యోచిస్తున్నట్టు రిలయన్స్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ ఇషా అంబానీ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో రిలయన్స్ రిటైల్ రెవిన్యూ రూ.3 లక్షల కోట్ల మార్కును దాటినట్టు చెప్పారు. వచ్చే 4 ఏండ్లలో దీన్ని రూ.6 లక్షల కోట్లకు తీసుకెళ్తామన్న ఆశాభావాన్ని కనబర్చారు. రిటైల్ రంగంలో తమకు 30 కోట్లకుపైగా కస్టమర్లున్నట్టు పేర్కొన్నారు. కాగా, ఇప్పటికే రిలయన్స్ రిటైల్ విలువ 100 బిలియన్ డాలర్లను దాటిన సంగతి తెలిసిందే.

ఏజీఎం ముఖ్యాంశాలు

- రిలయన్స్ తమ తొలి సోలార్ గిగా-ఫ్యాక్టరీని ఈ ఏడాదే ఏర్పాటు చేయాలని చూస్తున్నది.
- ఇందులో పీవీ మాడ్యుల్స్, సెల్స్, వేఫర్స్-ఇంగోట్స్, పాలీసిలికాన్, గ్లాస్ తయారు కానున్నాయి.
- ఈ ఏడాదే 20 గిగావాట్స్ సోలార్ పీవీ తొలి రైలు తయారీ మొ దలు.
- 2025కల్లా మెగావాట్ స్థాయిలో సోడియం-ఐయాన్ సెల్ ఉత్పత్తిని పారిశ్రామికీకరణ. 2026లో ఏటా 50 మెగావాట్ లిథియం బ్యాటరీ సెల్స్ పైలట్.
- 2030 నాటికి 100 గిగావాట్ల పునరుత్పాదక శక్తి సామర్థ్యం ఆధారంగా కొత్త ఇంధన వ్యాపారాలను అభివృద్ధి చేసే దిశగా రిలయన్స్. ఇందుకోసం మూడేండ్లపాటు 10 బిలియన్ డాలర్లను పెట్టుబడిగా పెట్టాలని 2021 లోనే నిర్ణయించుకున్న సంస్థ.
- రెన్యువబుల్ ఎక్విప్‌మెంట్, బ్యాటరీ స్టోరేజీ, ఫ్యూయల్ సెల్స్, హైడ్రోజన్ తయారీ కోసం గుజరాత్‌లోని జమ్‌నగర్‌లో 4 గిగా ఫ్యాక్టరీల నిర్మాణం.
- జియో క్లౌడ్‌లో ఏ కాల్‌నైనా యూజర్లు రికార్డు చేసుకొని, స్టోర్ చేసుకునేలా జియోఫోన్‌కాల్ ఏఐ సర్వీస్‌ను పరిచయం చేసిన ఆకాశ్ అంబానీ
- జామ్‌నగర్‌లో గిగావాట్ స్థాయిలో ఏఐ-రెడీ డాటా సెంటర్లను ఏర్పాటు చేయనున్న రిలయన్స్.
- భారతీయ వినోద పరిశ్రమలో వాల్ట్ డిస్నీతో రిలయన్స్ డీల్ ఓ నూతన శకానికి నాంది పలికిందన్న ముకేశ్ అంబానీ. ఈ డీల్‌తో రూ.70వేల కోట్ల సంస్థ ఏర్పడుతుండగా.. ఇందులో డిస్నీ హాట్‌స్టార్, జియో సినిమా ఓటీటీ స్ట్రీమింగ్ వేదికలతోపాటు 120 టెలివిజన్ చానల్స్ ఉంటున్నాయి.

నిర్మాణ రంగంలోకి ఎంఎస్ఎన్ గ్రూపు



కొండాపూర్, ఆగస్టు 29 : ఫార్మా దిగ్గజాల్లో ఒకటైన ఎంఎస్ఎన్ గ్రూపు తాజాగా రియల్ ఎస్టేట్ రంగంలోకి అడుగుపెట్టింది. ఎంఎస్ఎన్ రియల్టీని స్థాపించింది. ఈ సందర్భంగా ఎంఎస్ఎన్ గ్రూపు ఫౌండర్, సీఎండీ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. నిర్మాణరంగంలో తమకంటూ ప్రత్యేకతను చాటడానికి ఈ రంగంలోకి అడుగుపెట్టినట్లు, ముఖ్యంగా వినియోగదారులకు నాణ్యత ప్రమాణాలతో సకల సౌకర్యవంతమైన గృహాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన ప్రకటించారు. ఇందుకు సంబంధించి హైదరాబాద్‌లో ఎంఎస్ఎన్ రియాలిటీ లోగోను ఆయన ఆవిష్కరించారు. ఫార్మా రంగంలో ఎంతో కాలంగా సుదీర్ఘ సేవలనందిస్తున్న ఎంఎస్ఎన్ గ్రూపు.. రియల్ ఎస్టేట్ రంగంలోనూ ప్రత్యేక ముద్రను వేసేలా సేవలను అందించనున్నట్లు తెలిపారు. రెసిడెన్షియల్, కమర్షియల్ నిర్మాణాలను వినియోగదారులకు అందించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని, వచ్చే రెండు నెలలో ప్రభుత్వ అనుమతులతో హైదరాబాద్‌లో తమ మొదటి ప్రాజెక్ట్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

అంబానీని దాటేసిన అదానీ

- 11.6 లక్షల కోట్ల సంపదతో దేశీయ కుబేరుడు
- హురూన్ ఇండియా జాబితా విడుదల



న్యూఢిల్లీ, ఆగస్టు 29: హిండెన్‌బర్గ్ దెబ్బకు లక్షల కోట్ల సంపదను కోల్పోయిన గౌతమ్ అదానీ మళ్లీ దేశీయ కుబేరుడిగా అవతరించారు. ప్రస్తుత సంవత్సరానికిగాను తన సంపద 95 శాతం పెరిగి రూ.11.6 లక్షల కోట్లతో దేశీయ శ్రీమంతుల జాబితాలో అగ్రస్థానం దక్కించుకున్నారు. ఈ స్థానంలో కొనసాగిన ముకేశ్ అంబానీ రెండో స్థానానికి పడిపోయినట్టు 2024 సంవత్సరానికిగాను హురూన్ ఇండియా విడుదల చేసిన సంపన్నవర్గాల జాబితాలో పేర్కొంది. గతేడాదికాలంలో ముకేశ్ అంబానీ సంపద 25 శాతం పెరిగి రూ.10.14 లక్షల కోట్లుగా నమోదైంది. 2023లో గౌతమ్ అదానీ సంపద 57 శాతం కరిగిపోయి రూ.4.74 లక్షల కోట్లకు పరిమితంకాగా, ఇదే సమయంలో ముకేశ్ అంబానీ సంపద రూ.8.08 లక్షల కోట్లకు ఎగబాకింది. ఆ తర్వాతి స్థానాల్లో రూ.3.14 లక్షల కోట్లతో హెచ్‌సీఎల్ ఫౌండర్ శివ్ నాడర్ మూడో స్థానంలో నిలువగా, రూ.2.89 లక్షల కోట్లతో సైరస్ పూనావాల నిలిచారు. రూ.2.50 లక్షల కోట్ల సంపదతో దిలీప్ సంఘ్వీ ఐదో స్థానం వరించింది. భారత్‌లో బిలియనీర్ల సంఖ్య నానాటికి పెరుగుతున్నదని తెలిపింది. గతేడాది భారత్‌లో ప్రతి 5 రోజులకొక బిలయనీరు తయారైనట్లు నివేదిక వెల్లడించింది.

- రూ.7,300 కోట్ల సంపదతో బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ తొలిసారిగా ఈ జాబితాలో చోటు లభించింది.
- అతి పిన్న వయస్సు కలిగిన జెప్టో కో-ఫౌండర్ కైవల్య వొహ్రా తొలిసారిగా చోటు సంపాదించుకున్నారు. రూ.3,600 కోట్ల సంపద కలిగివున్నారు.
- అపర్ణ కన్‌స్ట్రక్షన్ ఫౌండర్ సీ వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్ సుబ్రమణియన్ రెడ్డిల సంపద అత్యధికంగా పెరిగింది.
- పొంగులేటి హర్ష రెడ్డి(కాంగ్రెస్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తనయుడు) రూ.1,400 కోట్ల వ్యక్తిగత సంపదతో ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు.
- రూ.1,000 కోట్ల కంటే అధిక ఆస్తి కలిగినవారు కొత్తగా 220 మంది జతవడంతో మొత్తం సంఖ్య 1,539కి చేరుకున్నారు.

మూడో స్థానంలో హైదరాబాద్

హైదరాబాద్ మరో ఘనతను సాధించింది. నగరాల వారీగా శ్రీమంతులు జాబితాలో తొలిసారిగా బెంగళూరును అధిగమించి హైదరాబాద్ మూడో స్థానం దక్కించుకున్నది. నగరం నుంచి 104 మంది కుబేరులు ఉన్నట్లు హురూన్ విడుదల చేసిన జాబితాలో వెల్లడించింది. 386 మందితో ముంబై ఎప్పటిలాగే తొలి స్థానంలో నిలువగా, 217 మందితో న్యూఢిల్లీ ఆ తర్వాతి స్థానం వరించింది. హైదరాబాద్‌లో కొత్తగా ఈ ఏడాది 17 మంది శ్రీమంతుల జాబితాలో చేరినట్లు పేర్కొంది. అలాగే బిలియనీర్లు ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఐదో స్థానంలో నిలిచింది.

తెలుగు శ్రీమంతులు వీరే..

వ్యక్తి	సంపద (రూ.కోట్లలో)
మురళీ దివీస్(దివీస్)	76,100
పీ పిచ్చిరెడ్డి(మెయిల్)	54,800
పీవీ కృష్ణా రెడ్డి(మెయిల్)	52,700
జీఎం రావు(జీఎమ్మార్)	36,300
పీవీ రాంప్రసాద్ రెడ్డి(అరబిందో)	35,100
బండి పార్థసారథి రెడ్డి(హెటిరో)	29,900
ప్రతాప్ రెడ్డి(అపోలో గ్రూపు)	28,400

పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జ్యోతి

వైభవంగా శ్రీవారి పవిత్రోత్సవాలు

ప్రత్యేక పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే గండ్ర దంపతులు

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 29: పట్టణంలోని మంజూరునగర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న ఆలయ ప్రథమ వార్షికోత్సవ పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. టీటీడీ అర్చక స్వామి పరాశరం భవ నారాయణచార్యుల బృందం నేతృత్వంలో గురువారం వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గండ్ర భూపాల్‌రెడ్డి రూ.లక్ష, గార్లపాటి సురేందర్‌రెడ్డి రూ.50,116, అధిరత్ రాంరెడ్డి రూ.25 వేలు, బండారు ప్రగతి వెంకట్‌రెడ్డి రూ.5 వేలు, ప్లెక్సీ, మైక్ అనౌన్స్‌మెంట్ కోసం బుర్ర రమేశ్ రూ.28 వేలు, స్వామి వారి వస్త్రాలకు రూ.20 వేలు భక్తులు విరాళాల రూపేణా ఆలయ కమిటీకి అందజేశారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు, సీపీఐ నాయకులు

తాగునీటి కోసం మహిళల ఆందోళన

ఖాళీ బిందెలతో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 29: కారల్ మార్క్స్ కాలనీ 25వ వార్డులో మంచి నీటి సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం సీపీఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట మహిళలు ఖాళీ బిందెలతో మహిళలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు క్యాతరాజు సతీశ్, పట్టణ కార్యదర్శి సోత్కు ప్రవీణ్ మాట్లాడారు. 25వ వార్డులోని ప్రజలు అనేక సమస్యలతో బాధపడుతున్నారని, మంచినీటి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. మున్సిపల్ అధికారులు ఇష్టం వచ్చినట్లు మిషన్ భగీరథ ద్వారా నీరు సరఫరా చేస్తుంటే వృథాగా పోయి ఎవరికీ నీళ్లు దొరకని పరిస్థితి ఉందన్నారు. అధికారులు సమయానుసారంగా నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీరు మురికిగా వస్తున్నదన్నారు. వాటిని తాగడం వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. కాలనీలో అంతర్గత రోడ్లు లేవని, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదన్నారు. అనంతరం పలు సమస్యలపై మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు నేరెళ్ల జోసెఫ్, 25వ వార్డు సభ్యులు పల్లెర్ల రజిత, సంధ్య, చందన, మమత, స్వప్న, యాకూబ్ పాషా, తిరుపతి, మట్టి కృష్ణ, రవన్న, అనూష, క్యాతరాజు మానస పాల్గొన్నారు.

రాకేశ్ కుటుంబానికి ఆర్థిక సాయం

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 29 : మున్సిపల్ పరిధి కాసీంపల్లికి చెందిన సిద్ధం రాకేశ్ పటేల్ అనారోగ్యంతో మృతి చెందగా గురువారం భూపాలపల్లి మాదిరాజ్ సాయి రతన్ (ఎంఎస్ఆర్) యువసేన టీం సభ్యులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాకేశ్ మృతదేహానికి నివాళులర్పించి అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాగవెల్లి విక్రమ్, బుర్ర మహేశ్, బుర్ర అశోక్, బుర్ర రాజు, పూసల యోగేంద్రాచారి, మహేందర్, శ్రీకాంత్ పటేల్ పాల్గొన్నారు.

మంచం పట్టిన మన్యం !

- ఏజెన్సీలో విజృంభిస్తున్న విషజ్వరాలు
- మోకాళ్ల నొప్పులతో ప్రజల ఆందోళన
- పీహెచ్‌సీల్లో పెరుగుతున్న ఓపీ సంఖ్య
- ఒకే నెలలో ముగ్గురు మృతి
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

జ్వరంతో చికిత్స పొందుతున్న మహిళ

వాజేడు, ఆగస్టు 29 : విష జ్వరాలతో గిరిపుత్రులు అల్లాడుతున్నారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు మంచం పడుతున్నారు. గ్రామాల్లో పారిశుద్య పనులు చేపట్టకపోవడం, సకాలంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయకపోడంతో రోజురోజుకూ జ్వర బాధితులు పెరుగుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రోజుకు వంద మందికి పైగా వస్తున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒక వేళ జ్వరాలు తగ్గినా, మోకాళ్ల నొప్పులతో బాధ పడుతున్నారు. అంతేకాకుండా వాజేడు మండలంలో జ్వరంతో ఒకే నెలలో ముగ్గురు మృతి చెందడం భయాందోళనకు గురిచేస్తున్నది. పీహెచ్‌సీల్లో చూపించుకున్నా తగ్గకపోవడంతో ఏటూరునాగారం ప్రభుత్వ వైద్యశాలతో పాటు భద్రాచలం, హనుమకొండ, ఖమ్మం తదితర ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. కొంగాల గ్రామ పంచాయతీ పరిధి జగన్నాథపురం గ్రామానికి చెందిన బొగ్గుల కాంచన, కొంగాలకు చెందిన బాలింత మోడెం లక్ష్మి, దూలపురం జీపీ పరిధి పాయబట్ల గ్రామానికి చెందిన అల్లి నారాయణ జ్వరంతో మృతిచెందారు. దీంతో స్థానిక ప్రజలతోపాటు మండల వాసుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. గ్రామాల్లో వ్యాధులపై అవగాహన కల్పించకపోవడంతో చాలా మందిని జ్వరం పీడిస్తున్నదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సకాలంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయకపోవడం, పారిశుద్య పనులు చేపట్టకపోవడం ప్రధాన కారణంగా తెలుస్తున్నది. మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు వైద్యులు సెలవులో ఉండడంతో పల్లెదవాఖాన వైద్యాధికారి జ్ఞానస జ్వర పీడితులకు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తున్నారు.

ఆర్ఎంపీల మితిమీరిన వైద్యం

ప్రజలకు జ్వరాలు రావడంతో ఆర్ఎంపీలను ఆశ్రయిస్తే ప్రాథమిక చికిత్స చేయాల్సి ఉండగా సెలైన్ బాటిల్స్‌తో పాటు యాంటీబయోటిక్స్ ఇంజక్షన్ ఇస్తున్నట్లు తెలుస్తున్నది. అంతేకాకుండా పరిమితికి మించి వైద్యం చేస్తున్న రోగుల వద్ద అందినకాడికి దోచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ల్యాబులు, మెడికల్ షాపులపై కొరవడిన పర్యవేక్షణ

మండలంలో పలు మెడికల్ షాపులు, ల్యాబులపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. బీనామీల పేరుతో ఫార్మాసిస్టు లేకుండా మెడికల్ షాపులు నిర్వహిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. పలుచోట్ల నిబంధనలు ఉల్లంఘించి ల్యాబ్‌లు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కనీసం తనిఖీలు చేసిన దాఖలాలు కూడా లేవని చెప్పవచ్చు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

-జ్ఞానస, పల్లె దవాఖాన వైద్యురాలు

ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండి జ్వరాలు వచ్చిన వెంటనే దగ్గర్లో ఉన్న ప్రభుత్వ వైద్యశాలలు లేదా పీహెచ్‌సీలకు వచ్చి సకాలంలో చికిత్స పొందాలి. జ్వరం తగ్గుముఖం పట్టినా వైరల్ అర్థరైటిస్ కారణంగా నెలరోజుల వరకు మోకాళ్ల నొప్పులు ఉంటాయి. ప్రస్తుతం అందరికీ అలాగే జ్వరాలు వస్తున్నాయి. ఆందోళన చెందాల్సిన పనిలేదు.

వైద్యంకోసం వచ్చి లైన్లో ఉన్న రోగులు

దహనసంస్కారాలకు జయశంకర్ ఫౌండేషన్ చేయూత

చిట్యాల (మొగుళ్లపల్లి), ఆగస్టు 29 : మండలంలోని పాత ఇసిపేట గ్రామానికి చెందిన నిరుపేద బొచ్చు సౌందర్య (55) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందింది. దహన సంస్కారాలకు డబ్బులు లేకపోవడంతో ఎవరూ ముందుకు రాలేదు. దీంతో గ్రామానికి చెందిన కొంతమంది యువకులు జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతికి ఫోన్ చేసి సమాచారం అందించడంతో వెంటనే గ్రామానికి చేరుకున్నారు. మృతదేహానికి నివాళులర్పించి సొంత డబ్బులతో దహన సంస్కారాలు నిర్వహించి, శవయాత్రలో పాడె మోశారు. అంతేకాకుండా మృతురాలి దశదినకర్మ వరకు ఖర్చుల బాధ్యత తీసుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మొగుళ్లపల్లి, టేకుమట్ల, చిట్యాల మండలాల ఇన్‌చార్జిలు నేర్పాటి అశోక్, జెట్టి రమేశ్, రాజ్ నాయక్, రాజు, శ్రీనివాస్, స్వామి పాల్గొన్నారు.

బాధితుడికి ఎల్‌వోసీ అందజేత

పలిమెల, ఆగస్టు 29 : అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న వ్యక్తికి మంత్రి శ్రీధర్‌బాబు గురువారం ఎల్‌వోసీ అందజేశారు. మండలకేంద్రానికి చెందిన దందేర సత్యం నిమ్స్‌లో చికిత్స పొందుతుండగా వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థికంగా ఇబ్బంది పడుతుండగా విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన రూ.2 లక్షల ఎల్‌వోసీని బాధితుడికి మంజూరు చేయించారు.

దాడి కేసులో ఒకరి అరెస్ట్

కాటారం, ఆగస్టు 29 : దాడి చేసి భయాందోళనలకు గురి చేసిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అభినవ్ గురువారం తెలిపారు. మండలకేంద్రానికి చెందిన సంపత్‌తో ఐదు రోజుల క్రితం వివాహ బరాత్‌లో శ్రవణ్‌కు గొడవ జరిగింది. దీనిని మనుసులో పెట్టుకొని సంపత్‌ను కొట్టడంతో పాటు బెదిరింపులకు గురిచేశాడు. దీంతో సంపత్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేసి నిందితుడు శ్రవణ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చెప్పారు.

పేకాడుతున్న తొమ్మిది మందిపై కేసు

చిట్యాల, ఆగస్టు 29 : మండలంలోని నవాబుపేట శివారులో పేకాట స్థావరంపై దాడి చేసి తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రవణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో గురువారం పేకాట ఆడుతుండగా శిబిరంపై దాడి చేసినట్లు తెలిపారు. దాడిలో ఎండీ రఫీ, మేడిపల్లి శ్రీనివాస్, ఎండీ అకీమ్ పాషా, వనం తిరుపతి, దేవునూరి నరేశ్, సాదా రాకేశ్, పప్పు సురేశ్, కలికోట లక్ష్మణ్, జెట్టి కుమార్ పట్టుబడినట్లు చెప్పారు. వారి వద్ద నుంచి రూ.3,200 నగదు సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 29 : వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందించేందుకు సాంకేతికతతో మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని భూపాలపల్లి సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ బీ మల్చూర్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ మెయింటనెన్స్‌ను యాప్‌లో పొందుపరుస్తున్నామన్నారు. పనులు సకాలంలో పూర్తవడానికి ఈ -స్టోర్ విధానాన్ని ప్రవేశపెట్టినట్లు చెప్పారు. డిస్కమ్‌కు సంబంధించిన ప్రతి సమాచారం చూసే డాష్ బోర్డు అప్లికేషన్‌ను పెంపొందించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. బిల్లింగ్, కలెక్షన్, అంతరాయాలు, ఫిర్యాదుల వివరాలు కమాండ్ కంట్రోల్ లాగా ఒకే చోట తెలుసుకునే వీలుంటుందన్నారు. చాట్ బాట్, ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో రీయాక్టివ్ పవర్ కాంపన్సేషన్ ద్వారా పవర్ ఫ్యాక్టర్స్ ఘననీయంగా మెరుగు పరచడానికి కెపాసిటర్ బ్యాంకులు దోహద పడుతున్నాయని, వీటి ద్వారా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌తో పాటుగా టెక్నికల్ నష్టాలు ఘననీయంగా తగ్గినట్లు తెలిపారు. వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది ఉండొద్దని ఫీడర్లకు ప్రత్యామ్నాయ సరఫరా అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ఏళ్లు గడుస్తున్నా పరిహారం లేదు

కొండంపల్లి గ్రామాన్ని తరలించాలని ఓసీ-3 వద్ద గ్రామస్తుల ధర్నా



ఓసీ-3 వద్ద ధర్నా చేస్తున్న కొండంపల్లి భూ నిర్వాసితులు

గణపురం, ఆగస్టు 29 : తమ పిల్లలకు ఉపాధి, ఉద్యోగాలు వస్తాయనే ఆశతో విలువైన పంట భూములను సింగరేణి యాజమాన్యానికి అందిస్తే వారి భవిష్యత్‌ను అంధకారం చేస్తున్నదని కొండంపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కొండంపల్లి గ్రామాన్ని త్వరగా తరలించాలని డిమాండ్ చేస్తూ గురువారం మండలంలోని ధర్మారావుపేట శివారు ఓసీ- 3 వద్ద గ్రామస్తులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న గ్రామస్తులందరి భూములు తీసుకుని తమ గ్రామాన్ని తరలిస్తామన్నారు. ఎనిమిది నెలలు దాటినా తమకు కేటాయిస్తామన్న ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందించలేదన్నారు. ఎకరా భూమికి రూ.25 లక్షలు ధర నిర్ణయించి నష్టపరిహారం రైతులకు వెంటనే అందివ్వాలన్నారు. ఓసీ-3 గనితో నష్టపోయిన పంటలకు వెంటనే పరిహారం ఇవ్వాలని, గ్రామస్తులకు ఉపాధి కల్పించాలని, భూ నిర్వాసిత రైతు కుటుంబాలకు ఆరోగ్య భద్రత హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ ముందు నుంచే వాహనంలో భూపాలపల్లి జీఎం వెళ్లారని కనీసం తమతో మాట్లాడకుండా వెళ్లడం ఎంతవరకు సబబని వారు ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న ఎస్సై రేఖ అశోక్ అక్కడికి చేరుకొని భూ నిర్వాసిత రైతులను సముదాయించి వారం రోజుల లోపు సమస్యను పరిష్కరించేలా అధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పడంతో ధర్నా విరమించారు. గడువులోపు సమస్య పరిష్కారం కాకపోతే మళ్లీ ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు మోతె కర్ణాకర్‌రెడ్డి, దాసరి లక్ష్మయ్య, వంగ రవి, సుంకరి రాజు, మాధవరెడ్డి, జగ్గారెడ్డి, చిత్తారి దేవేందర్, కుమార స్వామి, దాసరి అజిత్, విజయ, ఎడ్ల యాకూబ్, యాక లక్ష్మి, ఓదమ్మ, పసునూటి సుభద్ర, సుంకరి సలేందర్‌రెడ్డి, రాజిరెడ్డి, ఎడ్ల ఎల్లయ్య, కృష్ణారెడ్డి, శ్రీకాంత్, సుధాకర్, కంసమ్మ, రమ, నిర్మల, సరోజన, భద్రమ్మ, శంకర్, సునీత, లింగారెడ్డి పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతులు నోడల్ అధికారులను సంప్రదించాలి

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 29 : జిల్లాలో రుణమాఫీ కానీ రైతులు నోడల్ అధికారులను సంప్రదించాలని డీఏవో విజయ్ భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మీ ఖాతా రుణ మాఫీ జాబితాలో కనిపించక పోయినా, కుటుంబంలో యజమాని, యజమానురాలు లేకపోయినా, చనిపోయిన కేసులున్నా సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. భూపాలపల్లికి సతీశ్ కుమార్ (7288894772), చిట్యాల శ్రీనివాస్‌రెడ్డి (9110388920), టేకుమట్ల సారయ్య (9490585578), రేగొండ వాసుదేవ రెడ్డి (7288894775), మొగుళ్లపల్లి సురేందర్‌రెడ్డి (7288895776), గణపురం ఐలయ్య (7288894773), కాటారం సరిత (9491470229), మహదేవ్‌పూర్ ధర్మేందర్ (9052400390), మల్హర్‌రావు సుధాకర్ (8019900361), మహాముత్తారం శివకృష్ణ (9381482448), పలిమెల పృథ్వీ (7288894161)ని నోడల్ అధికారులుగా నియమించినట్లు పేర్కొన్నారు.